
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



జగిత్యాల

జిల్లా వార్తలు

5

మంగళవారం 19 మార్చి 2024



రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6:32 మంగళవారం

సహర్ 4:59 బుధవారం

మోదీ పర్యటన సాగిందిలా...

- ఉదయం 10.45 గంటలకు పీఎం మోదీ హెలి క్యాప్టర్ ద్వారా జగిత్యాలకు చేరుకున్నారు.
- ఉదయం 10.55 నిమిషాలకు పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయ మైదానంలో హెలి ప్యాడ్ వద్ద దిగారు.
- 11.15 నిమిషాలకు రోడ్డు మార్గంలో సభా వేదిక వద్దకు చేరుకున్నారు.
- 11.32 నిమిషాలకు మోదీ ప్రసంగం ప్రారంభించారు.
- 12.12 నిమిషాల వరకు పలు అంశాలను ప్రజలకు వివరిస్తూ ప్రసంగించారు.
- 12.20 గంటలకు ప్రజలకు వీడ్కోలు చెబుతూ హెలిప్యాడ్ వద్దకు వెనుదిరిగారు.
- 12.35 నిమిషాలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు.

సభ సైడ్ లైట్స్

- జగిత్యాల సభకు ప్రధాని మోదీ రావడంతోనే అప్పటికే అక్కడ వేచి ఉన్న సభికులు ఒక్కసారిగా కేరింతలు, ఈలలు, చప్పట్లతో స్వాగతం పలికారు.
- మోదీ తెలుగులో ప్రసంగం ప్రారంభించడంతో సభికులు చప్పట్లు, ఈలలు వేశారు.
- బీజేపీకి మద్దతు పలుకుతూ ప్రధానీ మోదీ పిలుపు మేరకు సభికులు తమ మొబైల్స్‌లోని టార్చ్‌లైట్ ఆన్ చేసి కేరింతలు కొట్టారు.
- సభలో పీఎం మోదీ వచ్చిన అనంతరం మంత్రి కిషన్‌రెడ్డికి మినహా ఇతరులెవరికి ప్రసగించే అవకాశం దక్కలేదు.
- పీఎం మోదీ సభకు వచ్చే వరకు పలువురు కళాకారుల ప్రదర్శనలు, గాయకులు పాడిన పాటలు సభికులను ఆకర్శింపజేసింది.
- ఎంపీ బండి సంజయ్ ప్రసంగిస్తున్న సమయంలో యువకులు కేరింతలు కొట్టారు
- ప్రధాని మోదీ కరీంనగర్, నిజామాబాద్, పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థులను నా సోదరులు అని సంభోదించారు.
- సభలో ఓ చిన్నారి భారతమాత వేషధారణతో ఆకట్టుకుంది.
- ఓ విద్యార్థి తన చేతితో వేసిన మోదీ చిత్రపటాన్ని ప్రదర్శించి ఆకట్టుకుంది.
- సభకు పలువురు యువకులు మోదీ మాస్కులు ధరించి హాజరయ్యారు.
- సభా ప్రాంగణంలో సుమారు ఇరవై ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ద్వారా మోదీ ప్రసంగాన్ని వీక్షించారు.

- జగిత్యాల అర్బన్



సభకు హాజరైన ప్రజలు



బీజేపీలో జోష్

- కమలనాథుల్లో ఉత్తేజం నింపిన సంకల్ప సభ
- నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్‌లపై ప్రభావం
- మోదీ నినాదాలతో దద్దరిల్లిన జగిత్యాల



బీజేపీ అభ్యర్థులతో ప్రధాని మోదీ



ప్రధాని మోదీతో బీజేపీ జిల్లా అధ్యక్షులు



మోదీకి స్వాగతం పలుకుతున్న నాయకులు



నినాదాలు చేస్తున్న మహిళలు

జగిత్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): లోక్ సభ ఎన్నిలకు షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో జగిత్యాలలో ప్రధాని నరేంద్రమోదీ బీజేపీ నిర్వహించిన విజయ సంకల్ప సభ కమలానికి కీలకంగా మారింది. నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాలతో ఉత్తర తెలంగాణ లోని పలు సెగ్మెంట్‌లపై ప్రభావం చూపేలా బీజేపీ నేతలు భారీ బహిరంగ సభను నిర్వహించడంలో సక్సెస్ అయ్యారు. జగిత్యాల విజయ సంకల్ప సభ సక్సెస్ కావడంతో కమలనాథుల్లో నూతనోత్తేజం నెలకొంది. ఇక దూసుకు పోవుడే అన్న రీతిలో నాయకులకు ఈ సభ భరోసానిచ్చింది. మోదీ పలు సందర్భాల్లో తెలంగాణ, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి పదం ఉచ్చరించగానే జనం ఈలలు కొట్టారు. సభ ఆద్యాంతం మోదీ నినాదంతో మారు మ్రోగింది. ప్రధాని మోదీ ప్రసంగిస్తున్న సమయంలో పలు పర్యాయాలు జనం మోదీ..మోదీ అని చప్పట్లు కొడుతూ కేరింతలు వేస్తూ..ఈలలు వేస్తూ నినదించారు. ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి లోక్ సభ సెగ్మెంట్‌ల నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో జనం జగిత్యాలకు తరలివచ్చారు.

భారీ సంఖ్యలో మహిళలు, యువత..

ప్రధాని నరేంద్రమోదీ హాజరైన విజయ సంకల్ప సభకు జనం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఇందులో ప్రధానంగా మహిళలు, యువత ఎక్కు వగా ఉన్నారు. జగిత్యాల పట్టణంతో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజలు రెండు, మూడు కిలో మీటర్ల దూరం నడిచి వచ్చి సభకు హాజరయ్యారు. యువకులు, మహిళలు సొంత వాహనాలపై కొందరు.. ఆర్టీసీ బస్సులు, బైక్‌లపై మరికొందరు వేల సంఖ్యలో ఉత్సాహంగా జగిత్యాలకు తరలివచ్చారు. ఎండను సైతం లెక్క చేయకుండా మోదీ ప్రసంగం వినడానికి తరలివచ్చి ఓపికగా ఉన్నారు.

తెలంగాణలో ముగిసిన మోదీ మలి విడత ప్రచారం..

దక్షిణాది రాష్ట్రాలపై దృష్టి సారించిన ప్రధాని నరేంద్ర మోదీ పార్ల మెంట్ ఎన్నికల ప్రచారంలో ముమ్మరంగా పర్యటిస్తున్నారు. ఈనెల 4వ తేదీన ఆదిలాబాద్‌లో, 5వ తేదీన పటాన్ చెరువులో వివిధ అభివృద్ధి కార్యక్రమా లను ప్రారంభించడంతో పాటు విడిగా ఏర్పాటు చేసి న రాజకీయ బహిరంగ సభల్లో తొలి విడత ప్రచా రంలో మోదీ పాల్గొని విపక్ష కాంగ్రెస్, బీఆర్ ఎస్‌లపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

పక్షం రోజులయిన గడవక ముందే మరోమారు ప్రధాని నరేంద్ర మోదీ మరోమారు తెలంగాణలో మలి విడత పర్యటన జరిపారు. ఈనెల 15వ తేదీన మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో రోడ్ షోలు, 16వ తేదీన నాగర్ కర్నూల్‌లో బహిరంగ సభలో ప్రసంగించారు. తాజాగా జగిత్యాలలో ఎన్నికల బహిరంగ సభలో ప్రధాని ప్రసం గించి తెలంగాణలో మలివిడత ప్రచారాన్ని ముగించారు. జగిత్యాలలో నిర్వహించిన బహిరంగ సభ బీజేపీకి కీలకంగా మారింది. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జగిత్యాలలో సభ నిర్వహించి సమీప లోక్ సభ నియోజకవర్గాలయిన కరీంనగర్, పెద్దపల్లి, ఆదిలాబాద్‌లలో సత్తా చాటడానికి ప్రయత్నించింది.

గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నిజామాబాద్, కరీంనగర్, అదిలాబాద్ ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంది. ఇదే తరహాలో ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ఫలితాలు రాబట్టుకోవడానికి కమలనాథులు ప్ర యత్నిస్తున్నారు. జగిత్యాలలో నిర్వహించిన మోదీ సభ సక్సెస్ కావడం కమలనాథుల ఆశలు రెట్టింపు చేశాయి.

నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారం...

విజయ సంకల్ప సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోది సుమారు 40 నిమిషాల పాటు ప్రసంగించారు. మొదటగా నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు అంటూ తెలుగులో తన ప్రసంగం ప్రారంభిం చారు. తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, రాష్ట్ర వికాసం కోసం నిరంతరం పనిచేస్తానని హామీనిచ్చారు. దేశంలో మూడోసారి తమ సర్కా రు రావాలంటూ పలు మార్లు నినాదాలు చేయిస్తూ ప్రధాని సభికులను ఉత్సాహపరిచారు.







ఆకట్టుకున్న కళాకారుల ఆటా.. పాట

పట్టణంలోని గీతా విద్యాలయం మైదానంలో సోమవారం బీజేపీ విజయ సంకల్ప సభలో కళాకారులు నిర్వహించిన ఆటా పాట సభికులను ఆకట్టుకుంది. కొంత కాలంగా కేంద్రంలో బీజేపీ సర్కారు హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కళాకారులు ఆడారు. పాడా రు. కళాకారులకు మద్దతుగా పలువురు నేతలు పదం, పాదం కలుపుతూ ఉత్సాహాన్ని నింపారు. పీఎం మోదీ నేతృత్వంలో జరిగిన కార్యక్రమాలను ప్రజలకు కళ్లకు కట్టినట్లుగా వివరిస్తూ కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. కళాకారుల ఆటా పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పలువురు యువతీ, యువకులు, విద్యార్థులు, బీజేపీ కార్యకర్తలు కళాకారుల ఆటా పాటలకు చప్పట్లతో అభినందించారు.

భారీ బందోబస్తు

భారత ప్రధాని నరేంద్ర మోదీ జగిత్యాలలో సోమవారం నిర్వహించిన విజయ సంకల్ప సభకు పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ నేతృత్వంలో వివిధ జిల్లాలకు చెందిన ఏడుగురు ఎస్పీలు, సుమారు 1600 మంది పోలీసు కానిస్టేబుల్స్, హోంగార్డు, స్పెషల్ పార్టీ పోలీసులు, కేంద్ర బలగాలు బందోబస్తులో భాగస్వామ్యమయ్యాయి. సభ జరిగిన మైదానం, హెలిప్యాడ్, ఇతర ప్రాంతాల్లో పోలీసులు అడుగడుగునా నిఘా ఉంచారు.

జగిత్యాలలోని ప్రధాన కూడళ్లలో తనిఖీలు చేశారు.

ట్రాఫిక్ ఆంక్షలతో వాహనాల దారి మళ్లింపు..

ప్రధాని మోదీ సభ సందర్భంగా వాహనాల రాక పోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముం దస్తు జాగ్రత్తలను పోలీసులు తీసుకున్నారు. ట్రాఫిక్ ఆంక్షలతో వాహనాలను దారి మళ్లించారు. ఉదయం 9 గంటల నుంచి పీఎం మోదీ సభ ముగిసే వరకు ట్రాఫిక్‌ను మళ్లించారు. భారీ వాహనాలకు బైపాస్ రహదారి గుండా పంపారు. జాతీయ రహదారిపై ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు జాగ్ర త్తలు తీసుకున్నారు.

పీఎం మోదీకి ఘన స్వాగతం

లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జగిత్యాలకు వచ్చిన పీఎం నరేంద్ర మోదీకి ఘన స్వాగతం లభించింది. పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయ సమీపంలో గల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద నిజామాబాద్, కరీంనగర్ ఎంపీలు ధర్మపురి అర్వింద్, బండి సంజయ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రవీణ్, బీజేవైయం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొనికెల నవీన్, మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ అను మల్ల కృష్ణ హరి, నాయకులు పడాల తిరుపతి పీఎం మోదీకి పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం కాన్వాయ్ ద్వారా సభా వేదిక వద్దకు ప్రధాని మోదీ చేరుకున్నారు.



సభకు భారీగా జన సమీకరణ

ప్రధాని నరేంద్ర మోదీ జగిత్యాలలో నిర్వహించిన విజయ సంకల్ప సభకు భారీగా జనం తరలివచ్చారు. నిజామాబాద్, కరీం నగర్ ఎంపీలు ధర్మపురి అర్వింద్, బండి సంజయ్‌ల నేతృత్వంలో జన సమీకరణ జరిగింది. నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ప్రజలు జగిత్యాలలో ప్రధాని నరేంద్ర మోదీ సభకు హాజరయ్యారు. ప్రత్యేక వాహనాలల్లో జనాన్ని సభా ప్రాంగాణానికి తరలించారు. వేల సంఖ్యలో హాజరైన జనానికి అవసరమైన మౌలిక సదు పాయాలను నిర్వాహకులు కల్పించారు. పలు బస్సులు, కార్లు, జీపులు, ఆటోల్లో జనం తరలివచ్చారు. పీఎం మోదీ సభకు జనం కిక్కిరిసి హాజరుకావడంతో కమలనాథులు ఆనందంలో మునిగారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుంది

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని గీతా విద్యాలయం మైదానంలో ప్రధాని నరేంద్రమోదీ హాజరై బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిం చిన విజయ సంకల్ప సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో కాళేశ్వరం కుంభ కోణంలో రూ. వేల కోట్లు కేసీఆర్ కుటుంబ సభ్యులు దోపిడి పాలు చేశారన్నా రు. లిక్కర్ స్కాం, గొర్రెల స్కాం, దళితబంధు స్కాం ఇలా బీఆర్ఎస్ పాలనలో ప్రజాధనం దోపిడీకి గురైందని విమర్శించారు. దేశంలో సుస్థిర పాలన బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. మెజార్టీ ప్రజలు నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపరుస్తున్నారన్నారు. ప్రధానంగా మహిళలు, యువత బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ప్రధాని మోదీ నిర్వహించిన ప్రతీ బహిరంగ సభకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు.

జగిత్యాల అడ్డా... ఉద్యమాల గడ్డ

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్



జగి త్యాల అడ్డా.. ఉద్యమాల గడ్డ అని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. జగిత్యాలలో రామన్న, గోపన్న తీవ్ర వాదుల చేతిలో అమ రులయ్యారని గుర్తు చేశారు. వీరులనుగన్న జగిత్యాల గడ్డలో పీఎఫ్ఐ అను దేశ ద్రోహులు అడుగుపెట్టడం ఆందోళనకరంగా ఉందన్నారు. రాముని పేరు చెబితే కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు గజ గజ వణుకుతున్నారన్నారు. దేశ ప్రజల భాగస్వామ్యంతో అయోధ్యలో రాముని గుడి కట్టింది బీజేపీ యేనని స్పష్టంచేశారు. బీజేపీ బరాబర్ రాముని పేరుతో ఎన్ని కలకు వెళ్తుందని, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు దమ్ముంటే బాబర్ పేరుతో ఓట్లు అడగాలని అన్నా రు. నిజాం సమాది వద్ద మోక రిల్లిన కేసీఆర్, ఓవైసీ సోద రులను కట్టివేసి రజాకార్ల సిని మా చూపించాలని కోరారు.

లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు పలకాలి

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్



ప్రస్తుతం జరుగుతున్న పార్ల మెంట్ ఎన్నికల్లో బీజేపీకి మద్ద తు పలికి, మోదీ నాయకత్వా న్ని బలపరచాలని నిజామాబా ద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ప్రపంచ దేశాలన్ని మోదీ వైపు చూస్తున్నాయని, ప్రస్తుత ఎన్ని కల్లో 400 సీట్లకు పైగా గెలుచుకొని మోదీని హ్యాట్రిక్ ప్రధాని చేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట కార్య వర్గ సభ్యురాలు, ము న్సిపల్‌మాజీ చైర్‌పర్సన్ బోగ శ్రావణి ప్రవీణ్ అధ్యక్షత వహించగా రాజ్య సభ సభ్యులు లక్ష్మణ్, పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్, బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఆర్మూర్, నిజామా బాద్ అర్బన్ ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ రాష్ట ప్రధాన కార్య దర్శులు ప్రదీప్, ప్రేమ్‌కుమార్, బీజే వైయం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొనికెల నవీన్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల బీజేపీ అధ్యక్షుడు పైడిపల్లి సత్య నారాయణరావు, ప్రతాప రామకృష్ణ, బీర్‌పూర్ జడ్పీటీసీ సభ్యురాలు పాత పద్మ పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

● ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య సంకశాల మల్లేష్

గణేశ్‌నగర్, మార్చి 18: విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య సంకశాల మల్లేష్ సూచించారు. శాతవాహన విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెవెన్ డే రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ ఫర్ పీహెచ్‌డీ స్టూడెంట్స్ అండ్ యంగ్ ఫాకల్టీ ఇన్ సోషల్ సైన్సెస్ ఇన్ తెలంగాణ రీజియన్ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ పరిశోధక విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పరిశోధనలో అవలంభించే స్టాటిస్టికల్ మెళకువలు, పరిశోధన ఆవశ్యకత తదితర అంశాలు ఈ కోర్సు ద్వారా నేర్చుకోవచ్చన్నారు. ఆచార్య బి.సుధాకర్‌రెడ్డి హానరరీ డైరెక్టర్ ఐసిఎస్ఎస్ఆర్, సదరన్ రీజియన్ మాట్లాడుతూ పరిశోధన అంశాల పట్ల నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలకు ఐసిఎస్ఎస్ఆర్, ఆర్థికపరమైన సహాయం చేయటానికి ముందుకు వస్తుందన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్ మాట్లాడుతూ రీసెర్చ్ మెథడాలజీపైన నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పీహెచ్‌డీ విద్యార్థులతో పాటు అధ్యాపకులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవటంలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హరికాంత్ మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు ఎప్పుడు కొత్త అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. శాతవాహన విశ్వావిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ మాట్లాడుతూ ఈ పరిశోధన కోర్సును విద్యార్థులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొదటి రోజు ఆచార్య సుధాకర్‌రెడ్డి 'ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ ఏనాబ్లెడ్ రీసెర్చ్ ఇన్ సోషల్ సైన్సెస్' అనే అంశం పైన తన సెషన్‌ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు డాక్టర్ ఎం మనోజ్‌కుమార్, డాక్టర్ కృష్ణకుమార్, డాక్టర్ తిరుపతి, బి.నరేష్ డాక్టర్ పరశురాములు, పరిశోధక విద్యార్థులు అజీజ్, విజయానంద్, వివిధ విశ్వ విద్యాలయాల నుంచి వచ్చిన పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నరు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌యూ ఉపకులపతి మల్లేష్

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

సిరిసిల్ల క్రైం, మార్చి 18: సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌లోని ఓ మెడికల్ షాప్ వద్ద 48ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి పడిపోవడంతో స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అతను మృతిచెందినట్లు టౌన్ సీఐ రఘుపతి సోమవారం తెలిపారు. ఇతని వివరాలు ఎవరైనా తెలిసినచో సమాచారం అందివ్వాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఆ వ్యక్తి మృతదేహాన్ని మార్చురీలో భద్ర పరిచామని పేర్కొన్నారు. గతంలోనూ రెండు సార్లు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందాడని, ఇతని వివరాలు తెలిస్తే ఫోన్ నెం. 8712656366కు సమాచారం అందివ్వాలని ఆయన పేర్కొన్నారు.

హుజూరాబాద్ ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ

● రూ. 8.64లక్షలు దోచుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు



ఏటీఎంను పరిశీలిస్తున్న ఏసీపీ, సీఐ

హుజూరాబాద్, మార్చి 18: గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎంలో చొరబడి భారీ ఎత్తున డబ్బు దోచుకెళ్లిన సంఘటన హుజూరాబాద్‌లో చోటు చేసుకుంది. టౌన్ సీఐ బొల్లం రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణంలోని కోర్టు సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో శనివారం బ్యాంకు సిబ్బంది సుమారు రూ.25లక్షలు పెట్టి వెళ్లిపోయారు. సోమవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎంలోకి చొరబడి ఏటీఎం మిషన్‌ను కట్టర్‌తో కట్‌చేసి అందులో ఉన్న రూ.8.64లక్షలు దోచుకెళ్లారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఏసీపీ శ్రీనివాస్‌జీ, టౌన్ సీఐ బొల్లం రమేష్‌లు సంఘటన స్థలానికి చేరుకొని ఏటీఎం మిషన్‌ను పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి ఏటీఎంను పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు టౌన్ సీఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వివాహ ఊరేగింపులో విషాదం

● డ్యాన్స్ చేస్తూ గుండెపోటుతో యువకుడి మృతి

ఓదెల, మార్చి 18: మండలంలోని కొలనూర్‌లో ఆదివారం రాత్రి ఒక వివాహ ఊరేగింపులో డ్యాన్స్ చేస్తూ కరీంనగర్‌కు చెందిన రావుల విజయ కుమార్(30) అనే యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. అతని మిత్రులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. విజయకుమార్ మిత్ర బృందం కొలనూర్‌కు చెందిన ఓ వ్యక్తి వివాహానికి వెళ్లారు. అనంతరం ఊరేగింపు నిర్వహిస్తున్న క్రమంలో విజయ్‌కుమార్ డ్యాన్స్ చేస్తూ, అకస్మాత్తుగా అక్కడే కుప్పకూలాడు. దీంతో స్థానికులు, మిత్రులు ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్ష అనంతరం అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య రావుల పల్లవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, సోమవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు యువకుడి మృతి

ధర్మారం, మార్చి 18: మండలంలోని కొత్తూర్ గ్రామానికి చెందిన భూత గడ్డల నర్సింగం(35) అనే వ్యక్తి సోమవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో నీట మునిగి మృతి చెందాడు. కొత్తూర్ గ్రామ శివారులో సాగల నారాయణ పొలం వద్ద ఉన్న వ్యవసాయ బావిలో చేపలు పట్టేందుకు నర్సింగం దిగాడు. బావిలో తూరు తీగ అతని చేతులకు చుట్టుకుని అదే బావిలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

రైతు సమస్యల పరిష్కారంలో బీజేపీ విఫలం

● కాళేశ్వరం అవినీతికి ఆస్కారం ఇచ్చింది మోదీనే ● తెలంగాణ ఫలితాలే దేశంలో పునరావృతం ● ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల , మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఎంపీ సీట్లు సున్నాకే పరిమితమవుతాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసి అమ్మకానికి పెట్టేలా చేసిన వ్యక్తి మోదీ అని అన్నారు. జగిత్యాలలో నిర్వహించిన సభలో మోదీ చేసిన ప్రసంగంలో దేశ భవిష్యత్ ప్రణాళిక వివరించాల్సి ఉండగా నిస్తేజంగా ఉందని, నిర్మాణాత్మకంగా ఉంటుందని భావిస్తే స్పష్టత లోపించిందన్నారు. ప్రధాని హోదాలో ఉన్న మోదీ బాధ్యతారహితంగా మాట్లాడారన్నారు. దశాబ్ద కాలంగా మోదీ దేశాన్ని పరిపాలించినప్పటికీ రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. మూడు నల్ల చట్టాలను ఉపసంహరించాలని రైతులు ఉద్యమిస్తే ప్రధాని వెనుకడుగు వేశారన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతుల పంటలకు గిట్టుబాట ధర కల్పనకు కృషిచేశామని గుర్తు చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ ఎంత వరకు నెరవేర్చారో కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇవ్వాలన్నారు. నిజామాబాద్‌లో గతంలో కంటే ఇప్పుడు పసుపు పంట సాగు 30 వేల ఎకరాలకు తగ్గిందని ఆరోపించారు. షుగర్ ఫ్యాక్టరీ గురించి మోదీ మాట్లాడడం ఆచ్చర్యం కలిగిస్తుందని అన్నారు. నిన్నటి వరకు బీఆర్ఎస్, బీజేపీ అలయ్, బలయ్‌గా ఉండి ఇప్పుడు ఎన్నికలకు ముందు డ్రామాలు ఆడుతున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఆవినీతికి కేంద్ర ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని, జాతీయ హోదాగా గుర్తించకపోవడంతోనే అవినీతికి ఆస్కారం బీజేపీనే కల్పించిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్టుపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ న్యాయ విచారణకు కమిటీ వేసిందన్నారు. తెలంగాణ పట్ల మోదీ వివక్ష చూపడంతోనే అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. లిక్కర్ కేసులో నిందితురాలిగా ఉన్న కవితను ఇంతకాలం ఎందుకు అరెస్టు చేయలేదో ప్రజలకు తెలుసునని కేవలం ఎంపీ ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకే అరెస్టుకు తెరలేపారన్నారు. రాష్ట్ర ఎన్నికల ఫలితాలే దేశంలో కూడా పునరావృతం అవుతాయని బీజేపీ నిజరూపం ప్రజలు గమనిస్తునారన్నారు. ఈ సమావేశంలో పీ సీసీ సభ్యుడు మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి ఉన్నారు.

జనశక్తి పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, మార్చి 18: జనశక్తి నక్సలైట్ల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌కు చెందిన పాకాల సాయి అనే వ్యక్తిని సోమవారం కోనరావుపేట పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌కు చెందిన సాయి అనే వ్యక్తి ప్రభుత్వ నిషేధిత విప్లవ సంస్థ అయిన జనశక్తి అరుణోదయ సంస్థలో పనిచేస్తున్నట్లు చెప్పి అమాయక ప్రజలను బెదిరింపులకు పాల్పడుతూ పార్టీ ఫండ్ పేరిట ప్రజల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. జనశక్తి నక్సలైట్ల పేరుతో డబ్బులు వసూళ్లకు పాల్పడే వారి సమాచారం అందివ్వాలని, ఎవరైనా ఫోన్‌కాల్‌చేసి బెదిరిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు

కరీంనగర్‌క్రైం, మార్చి 18: కిసాన్‌నగర్‌లోని బేతెస్తచర్చి సెక్రటరీ కవ్వంపల్లి తిమోతిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్-3 టౌన్ సిఐ తెలిపారు. మానకొండూర్ శాసన సభ్యుడు సత్యనారాయణను చర్చిలోని పిలిచి సన్మానించినందుకు ఎన్నికల కోడ్‌ఉల్లంఘన కింద మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి నివేదిక ప్రకారం కరీంనగర్-3 టౌన్‌లో తిమోతిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



మద్యం సేవించి వాహనం నడిపితే జైలు

కరీంనగర్ క్రైం, మార్చి 18: మద్యం సేవించి వాహనం నడిపిన వారికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ కరీంఉల్లా తెలిపారు. నగరలో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 19 మందిని కరీంనగనర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుచగా ఏడుగురు వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్ష, 16 వేల రూపాయల జరిమానా విధించడం జరిగిందన్నారు. మిగతా 12 మందికి 18,000 రూపాయల జరిమానా విధించడం జరిగిందన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నగరంలో ప్రతి రోజు స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్‌లు ఉంటాయన్నారు. ఈ సంవత్సరంలో 61 మందికి మద్యం సేవించి వాహనాలు నడిపినందుకు జైలు శిక్ష పడిందన్నారు.

22లోగా బీహెచ్‌ఎంసీటీ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, మార్చి 18: ఎస్‌యూ పరిధిలోని బీహెచ్‌ఎమ్‌సీటీ(బ్యాచిలర్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్ క్యాటరింగ్ టెక్నాలజీ) రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ విద్యార్థులు పరీక్ష రుసుం చెల్లించడానికి ఈ నెల 22వరకు గడువు ఉందని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో 27వతేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను ఏప్రిల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



లక్ష్మయ్య(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మార్చి 18: శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తూ బైక్ ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని గంగారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. మండలంలోని మొట్లపల్లికి చెందిన దొమ్మటి లక్ష్మయ్య(64) తన కొడుకు తిరుపతితో కలిసి ద్విచక్ర వాహనంపై సుల్తానాబాద్ మండలం పెరుకపల్లిలో ఆదివారం ఒక శుభకార్యానికి హాజరయ్యారు. రాత్రి మొట్లపల్లికి తిరిగి వస్తుండగా గంగారం శివారులో ద్విచక్ర వాహనంపై వెనక కూర్చున్న దొమ్మటి లక్ష్మయ్య చేతి కర్రకు ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనం తాకడంతో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం పైనుంచి తండ్రీకొడుకులు కిందపడ్డారు. తిరుపతికి స్వల్ప గాయాలు కాగా లక్ష్మయ్య తలకు బలమైన గాయాలయ్యాయి. టాటాఏస్ వాహనదారుడు తీవ్ర గాయాలైన లక్ష్మయ్యను వైద్యం కోసం కరీంనగర్ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఎస్ఐ ఓంకార్ యాదవ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సింగరేణి, ఎన్టీపీసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి విస్మిత తేజ్

జ్యోతినగర్, మార్చి 18: సింగరేణి, ఎన్టీపీసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి విస్మిత తేజ్ సూచించారు. విస్మిత తేజ్ ఎన్టీపీసీలో సోమవారం పర్యటించారు. ఉదయం రామగుండం ఎన్టీపీసీకి చేరుకున్న విస్మితకు ఈడీ కేదార్‌రంజన్ పాండు, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ) కంట్రోల్ రూంను పరిశీలించారు. ప్రాజెక్టుకు చెందిన ఆపరేషన్ అధికారులతో, యువ ఎగ్జిక్యూటివ్ ట్రైనీతో సమావేశమై విద్యుత్ కేంద్రం పనితీరుపై చర్చించారు. టీఎస్‌టీపీపీలోని ఇతర విభాగాలను ఏరియల్ వ్యూలో అదనపు కార్యదర్శి విస్మిత పరిశీలించారు. తరువాత 2600 మెగావాట్ల రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టులో పర్యటించారు. ఈ సందర్భంగా బొగ్గు సరఫరా, అన్‌లోడింగ్‌కు సంబంధించి ఆ శాఖ అధికారులతో మాట్లాడారు. ఎన్టీపీసీ రిజర్వాయర్‌లోని 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును అదనపు కార్యదర్శి విస్మిత తేజ్ సందర్శించారు. దేశంలోనే అతిపెద్ద ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు నిర్వహణ, పనితీరుపై ఆమె సంబంధిత అధికారులు, సిబ్బందిని అభినందించారు. అనంతరం



టీఎస్‌టిపిపిలో పర్యటిస్తున్న అదనపు కార్యదర్శి విస్మిత తేజ్

ఎన్టీపీసీ, సింగరేణి సీనియర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సింగరేణి, ఎన్టీపీసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, బొగ్గు సరఫరా, అన్‌లోడింగ్, కోల్ స్టాక్ విషయంలో సమస్యలు రాకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. సమావేశంలో సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్‌వీకే శ్రీనివాస్, ఎన్టీపీసీ ఈడీ(ఎఫ్ఎం) ప్రదిప్తా కుమార్ మిశ్రా, రామగుండం ఈడీ కేదార్ రంజన్ పాండు పాల్గొన్నారు.

వివాహిత హత్య

● గొంతు నులుమి ఘాతుకం
● పోలీసులకు లొంగిపోయిన నిందితుడు

మల్యాల, మార్చి18: మండలంలోని మ్యాడంపల్లి శివారులో ఓ వివాహిత తన మొదటి భర్త చేతిలో హత్యకు గురైంది. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాలకు చెందిన కరుపి అంజలి(22)కి గొల్లపల్లి మండలం అగ్గిమల్లకు చెందిన కొల్లూరి నరేష్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్ది రోజులు సాఫీగానే సాగిన వీరి సంసారంలో గొడవలు మొదలయ్యాయి. గొడవలు కాస్త ముదిరి ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో రెండేళ్ల క్రితం విడిపోయారు. అనంతరం అంజలికి సిద్దిపేటకు చెందిన మరో యువకుడితో కుటుంబ సభ్యులు వివాహం జరిపించారు. ఈ క్రమంలో అంజలి ఆదివారం మొదటి భర్త నరేష్ ఇంటికి వచ్చి కలుసుకుంది. అదే రోజు ఇద్దరి మధ్య ఏం జరిగిందో ఏమో గానీ మరునాడు సోమవారం ఉదయం అంజలి మృతదేహాన్ని మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులో కొందరు గుర్తించారు. నరేష్ మద్యం మత్తులో అంజలితో గొడవ పడి ఆదివారం గొంతు నులిమి హత్యకు పాల్పడినట్లు ఘటనా స్థలాన్ని బట్టి స్థానికులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా సోమ వారం గొడవ పడ్డ ప్రదేశానికి వెళ్లిన నరేష్ మృతదేహాన్ని చూసి అనంతరం నేరుగా గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. అక్కడి పోలీసులు మల్యాల పోలీసులకు సమాచారం అందించడంతో నరేష్‌ను మల్యాల స్టేషన్‌కు తరలించారు అనంతరం మల్యాల సీఐ రవి, ఎస్సై అబ్దుల్‌రహీం సంఘ టన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



అంజలి (ఫైల్)

రేపటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

కరీంనగర్ టౌన్, మార్చి 18: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ నెల 20 నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్) నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి జి.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. భౌతిక శాస్త్రం, అర్థశాస్త్రం జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహిస్తున్నందున అధ్యాపకులు సకాలంలో హాజరుకావాలన్నారు.

26 నుంచి బీ ఫార్మసీ పరీక్షలు

గణేశ్‌నగర్, మార్చి18: ఎస్‌యూ పరిధిలో బీ ఫార్మసీ మొదటి, రెండో సెమిస్టర్ పరీక్షలు 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రూ.7,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మార్చి 18: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,600 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 31మంది రైతులు 382క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 12క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,600, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్ల చేపట్టారు. గత శుక్రవారం క్వింటాల్ రూ.7800 పలికిన పత్తి ధర తాజాగా రూ.200 దిగింది.

సంస్కృతీ సంప్రదాయాలను పిల్లలకు అందించాలి



సుద్దాలను సన్మానిస్తున్న భారతి సాహిత్య సమితి సభ్యులు

కోరుట్ల, మార్చి 18: మన సంస్కృతి సంప్రదాయాలను పిల్లలకు అందించాలని సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల ఆశోక్ తేజ అన్నారు. పట్టణంలోని సినారె కళాభవనంలో భారతి సాహిత్య సమితి స్వర్ణోత్సవ ముగింపు కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జు జువ్వాడి నర్సింగరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాహిత్య సమితి వ్యవస్థాపకుడు స్వర్గీయ డాక్టర్ అందె వెంకటరాజం రచించిన "నిండగిరి నరసింహ శతకం"ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆశోక్‌తేజ మాట్లాడారు. కళలకు నిలయాలుగా కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలు నిలుస్తాయని అన్నారు. సామాజిక చైతన్యంలో సాహిత్యం పాత్ర చాలా కీలకమైనదని అన్నారు. తాను ఎంత ఎత్తుకు ఎదిగినా సాహిత్యంలో తనకు కోరుట్ల ప్రాంతం తల్లి లాంటిదని, తనకు మార్గ దర్శనం చేసిన ఈ గురువులను ఎన్నటికీ మరచిపోలేనని అన్నారు. సమితి సభ్యులు డాక్టర్ ఆశోక్ తేజ, కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నర్సింగరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాహిత్య సమిత సభ్యులు కంచర్ల రామాచార్య, బట్లు హరికృష్ణ, అందే రాజేంద్ర ప్రసాద్, రాజోజు భూమేశ్వర్, బ్రహ్మణగారి శంకర్ శర్మ, అందే శివప్రసాద్, ఆడెపు శేఖర్, కల్యకోట చంద్రప్రకాష్, రాస భూమయ్య, తత్వాది మాదివి-రాజేంద్ర ప్రసాద్, గోనే శ్రీహరి, వనపర్తి చంద్రమోహన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

రేపటి నుంచి ధర్మపురి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్


ధర్మపురి, మార్చి 18: ధర్మపురి క్షేత్రంలో మార్చి 20 నుంచి జరిగే శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. స్థానిక నంది విగ్రహం నుంచి దేవాలయం వరకు గల ప్రధాన రహదారి వరు చేపట్టిన ఏర్పాట్లను సోమవారం ఆయన మండల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్రంలోని దేవాలయంలో జరిగే స్వామి వారి కళ్యాణం, బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో జరిగే తెప్పె, డోలోత్సవాలు, ఉత్సవాల కోసం హాజరయ్యే భక్తుల వాహనాల కోసం పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. భక్తుల కోసం అందించే తాగు నీరు, గోదావరి నది వద్ద భక్తుల స్నానాలు సంబంధించిన వసతుల ఏర్పాట్లను ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్రంలో 13 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాకు హాజరయ్యే భక్తులు గోదావరి నది స్నానం చేసుకుని స్వామి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణం చేసే వరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రత్యేక వసతుల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన నూతన కమిటీ సభ్యులు కూడ సమన్వయంతో పని చేసి అన్ని వేళలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని అన్నారు. అనంతరం నూతన ఉత్సవ కమిటీ సభ్యులు జక్కు రవీందర్, బాదినేని సత్యనారాయణ, రాందేని మొగిలి, దాసరి పురుషోత్తం, ఏదులాపురం మహేందర్, రాపర్తి సాయికిరణ్, స్తంభంకాడి గణేష్, పసుపునూటి శ్రీకాంత్,



ఉత్సవ కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

మాదాసు మల్లేష్, కొమురెల్లి పవన్‌కుమార్, నేదునూర్ శ్రీధర్‌ను ఆయన శాలువా కప్పి సన్మానించి, ప్రత్యేకంగా అభినందించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఉత్సవ కమిటీ సభ్యులు జక్కు రవీందర్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్ పాల్గొన్నారు.

-ధర్మపురి పట్టణంలోని కమలాపూర్ చౌరస్తా వద్ద కటుకం స్టూడియోస్ వారిచే నిర్మించబడిన ఓ అంబేద్కరుడా మీకు పోటీ ఎవ్వరూ అనే సాంగ్ పోస్టర్, సాంగ్ ప్రోమోను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ భీమనాతి శారద, లైరిక్ కటుకం నరేందర్, సింగర్‌లు శాంతాకుమారి, గంగాధర్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.







ప్రశాంతంగా పదోతరగతి పరీక్షలు ప్రారంభం

● పది పరీక్షలు తొలిరోజు ప్రశాంతం
● రెగ్యులర్ 18మంది, సప్లిమెంటరీ 3 మంది గైర్హాజరు
● పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల అర్బన్, మార్చి 18: పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైన తరుణంలో మాల్ ప్రాక్టీస్‌కు ఆస్కారం లేకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని యాస్మిన్ బాషా అన్నారు. జిల్లాలో సోమవారం ప్రారంభమైన పదోతరగతి పరీక్షల కేంద్రాలను సందర్శించారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 64 కేంద్రాలను ఏర్పాటు చేశామని ఇందులో భాగంగా తొలిరోజు తెలుగు పరీక్ష-1 కు మొత్తం 11394 విద్యార్థులుండగా, 11376 మంది విద్యార్థులు హాజరవగా, 18 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షకు మొత్తం 37 మంది విద్యార్థులకు గానూ, 34 మంది హాజరవగా, 3 విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. కలెక్టర్ 02 పరీక్ష కేంద్రాలు, రాష్ట్ర పరిశీలకు లు 06, డీఈవో 06, ఫ్లయింగ్ స్క్వాడ్ 21 పరీక్ష కేంద్రాలను సందర్శించినట్లు తెలిపారు.



పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ డీఈవో

మెట్‌పల్లి రూరల్ : మెట్‌పల్లి, మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. సోమవారం మెట్‌పల్లిలో 6 కేంద్రాలు, మండలంలోని జగ్గసాగర్, బండలింగాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మెట్‌పల్లిలో ఏర్పాటు చేసిన ఆరు కేంద్రాల్లో 1238మంది, మండలంలోని రెండు కేంద్రాల్లో 243 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ముందస్తుగా చర్యలు తీసుకున్నట్లు ఎంఈవో భీమయ్య తెలిపారు. మల్లాపూర్ మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో భీమయ్య తెలిపారు.

కోరుట్ల : రాష్ట్ర విద్యాశాఖ ఆద్వర్యంలో సోమవారం ప్రారంభమైన పది పరీక్షలు ప్రశాంతం సాగాయి. పట్టణంలోని 9 పరీక్ష కేంద్రాలలో 1528 మంది విద్యార్థులకు గాను 1526 మంది హాజరయ్యారు. వివిధ పరీక్ష కేంద్రాలను మండల విద్యాధికారి నరేశం పరిశీలన జరుపగా కోరుట్ల ఎస్ ఐ కిరణ్ కుమార్ ఆద్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

రాయికల్: రాయికల్ మండల కేంద్రంలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో మొత్తం 750 మంది విద్యార్థులకుగాను 749 మంది విద్యార్థులు హాజరు కాగా, ఒక విద్యార్థి గైర్హాజరు అయ్యాడు.

ధర్మపురి: ధర్మపురి మండలంలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. పరీక్షల కోసం మగ్గిడి టీఎస్ స్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఏసీఈ హైస్కూల్‌లో కలిపి నాలుగు సెంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 655 మంది విద్యార్థులకు గాను 655 మంది విద్యార్థులు హజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఎంఈవో బత్తుల భూమయ్య పర్యవేక్షణలో పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లుగా రావులపెల్లి వెంకటరమణ, కె. శ్రీనివాస్, పి. మహేందర్, ఎం. బుచ్చన్న వ్యవహరించారు. మొత్తం 28 మంది టీచర్లు ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వర్తించారు.

బీర్‌పూర్ : మండలంలో సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలకేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలోని ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలోని 150 మంది పరీక్షలు రాసినట్లు ఎంఈవో భీమయ్య తెలిపారు.

కథలాపూర్ : మండలంలోని మూడు కేంద్రాల్లో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గంభీర్‌పూర్, మోడల్ స్కూల్, అంబారిపేట కేంద్రాల్లో 424 మందికి గాను ఇద్దరు గైర్హాజరయ్యారని ఎంఈవో ఆనందరావు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల కోసం అన్ని రకాల వసతులు కల్పించామని చెప్పారు.

వెల్గటూర్: మండలంలోని కుమ్మరిపల్లి మాడల్ స్కూల్, చెగ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 327 మందికి 327 మంది విద్యార్థులు తెలుగు పరీక్షకు హాజరైనట్లు ఎంఈవో బత్తుల భూమయ్య తెలిపారు. కుమ్మరిపల్లి పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరిండెంట్‌గా రాధారాణి, డిపార్ట్‌మెంటల్ అధికారిగా ప్రభాకర్, ఏడీవోగా రాజమణి వ్యవహరించారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసిన ట్లు ఎంఈవో తెలిపారు.

పెగడపల్లి: మండలంలో సోమవారం పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంబమయ్యాయి. మండలంలోని ఆరు జడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు ఒక మోడల్ స్కూల్, కేజీబీవి పాఠశాలల్లో మొత్తం 214 మంది విద్యార్థినీ విద్యార్థులకు గాను 214 మంది పరీక్షలకు హాజరు అయినట్లు మండల విద్యాదికారి శ్రీనివాస్ తెలిపారు.

బుగ్గారం : మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 148 మంది విద్యార్థులకు గాను 148 మంది పరీక్షలకు హాజరు అయినట్లు ఎంఈవో భత్తుల భూమయ్య తెలిపారు. పరీక్ష కేంద్రంలో చీప్ సూపరింటెంటెంట్‌గా జీవన్ కుమార్, డిపార్ట్ మెంటల్ ఆఫిసర్‌గా వసంతరాణి, సిట్టింగ్ స్క్వాడ్‌గా చంద్రశేఖర్ వ్యవరించారు.

కొడిమ్యాల : పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనాయి. కొడిమ్యాలలోని రెండు పరీక్షా కేంద్రాలను స్టేట్ ఆబ్జర్వర్ ఎ. ఉషారాణి పరిశీలించారు. మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలలో 377 మంది విద్యార్థులకు గాను 376 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈవో ఎ. శ్రీనివాస్ తెలిపారు.



పరీక్ష కేంద్రం వద్ద తనిఖీ చేస్తున్న సిబ్బంది



ధర్మపురి పట్టణంలో పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తున్న ఉపాధ్యాయులు

వేటగాళ్ల చేతిలో జాతీయ పక్షి హతం

నిందితులతో పాటు నెమలి, రైఫిల్ స్వాధీనం

పెగడపల్లి, మార్చి 18 : పెగడపల్లి మండలంలోని దోమలకుంట గ్రామంలో సోమవారం రాత్రి ఇరువురు అడవి జంతువుల వేటగాళ్లను పెగడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. పెగడపల్లి ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల పెగడపల్లి మండలంలోని దోమలకుంట గ్రామ శివారులో తుపాకీతో వేటాడి జాతీయ పక్షి నెమలిని చంపి కారులో తీసుకెల్తున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు వారిని వెంబడించి కారును పట్టుకుని తనిఖీ చేయగా గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన నలువాల సత్యనారాయణ, మల్యాల మండలం జవ్వాజి రాజు మల్యాల గ్రామం అనే వేటగాళ్ల తుపాకీతో శికారి చేసి కారులో తీసుకెల్తున్నట్లు జాతీయ పక్షి నెమలితో పాటు పాయింట్ 22 ఇంచ్ రైఫిల్, గొడ్డలితో పాటు కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

గత పాలకుల నిర్లక్ష్యంతోనే సాగునీటికి ఇబ్బంది

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్

ఎండపల్లి, మార్చి18; గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యంతోనే రైతులకు సాగునీటికి తిప్పలు తప్పడం లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం మారేడుపల్లి, ముంజంపల్లి, ఉండేడ్ గ్రామాల రైతులతో కలిసి వేంనూర్ పంప్‌హౌజ్ మోటర్‌ని సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పైప్‌లైన్ మరమ్మతులకు గురైందని అది సరిచేయడం ఆలస్యం అయిందన్నారు. ఎలక్షన్ కోడ్ అయిపోగానే శాశ్వత పరిష్కారం చేస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. ధర్మపురి నియోజకవర్గ నీటిని గజ్వేల్, సిద్దిపేటకు తరలించిన ఘనత మన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ది అన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రైతులతో కలిసి పంప్‌హౌజ్‌కి వెళుతుండగా తన వాహనాన్ని బసంతనగర్ పోలీసులు తనిఖీలు చేశారు. మారేడుపల్లి, ముంజంపల్లి, ఉండెడ్ గ్రామాల రైతులు ప్రభుత్వ విప్‌కి వినతి పత్రం అందజేశారు. మూడు గ్రామాల పోలీస్ స్టేషన్, పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖలు పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలో ఉన్నాయని, ప్రస్తుతం మా గ్రామాలు రెవెన్యూ జగిత్యాల జిల్లా ఎండపల్లి గ్రామాలలో ఉన్నాయని, రెండు దిక్కుల వెళ్లడం ఇబ్బందిగా ఉందని ఎండపల్లిలో పూర్తి కార్యాలయాలు అయ్యే వరకు వెల్గటూర్ మండలంలో విలీనం చేయాలని వినతి పత్రం అందజేశారు. దీనికి ఆయన స్పందించి సమస్య పరిష్కరిస్తానన్నారు. మండల అధ్యక్షులు శైలెందర్ రెడ్డి, మద్దుల గోపాల్‌రెడ్డి, గుండేటి జితెందర్ రెడ్డి పాల్గొన్నారు.

మత్స్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మెట్‌పల్లి, మార్చి, 18 : మత్స్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఛైర్మన్ పల్లికొండ ప్రవీణ్ కోరారు. సోమవారం తెలంగాణ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య ఛైర్మన్‌గా నామినేట్ అయిన మెట్టు సాయికుమార్‌ను శాలువాలతో నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మత్స్య కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురై జీవనోపాధి కోల్పోతున్నారని, వారి ఆర్థికాభివృద్ధి కోసం ప్రణాళికలను ప్రవేశ పెట్టాలన్నారు. ఈయన వెంటా గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంఘం వ్యవస్థాపకుడు సముద్రాల తిరుపతి, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు పల్లికొండ రవివర్మ ఉన్నారు.

కొడిమ్యాల-పూడూర్ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే

కొడిమ్యాల, మార్చి 18 : కొడిమ్యాల-పూడూర్ రోడ్డును సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం పరిశీలించారు. నిత్యం రద్దీగా ఉండి మరమ్మతు పనులకు నిధుల మంజూరైనప్పటికి పనులు కాక పోవటంతో సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. త్వరలో పనులు చేపట్టుతామన్నారు. అనంతరం మండలంలోని చెప్యాల గ్రామానికి చెందిన చెల్పూరి వేణు దీప కూతురు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు అందించారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లిఖార్జున్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెజిడెంట్ జీవన్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా శివ పార్వతుల కల్యాణం

కోరుట్ల రూరల్, మార్చి 18 : మండలంలోని మాదపూర్ గ్రామంలోని శివాలయంలో సోమవారం శివ పార్వతుల కళ్యాణం ఘనంగా సాగింది. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు అర్చన, అభిషేక కార్యక్రమాలను పురోహితులు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రాజరాజేశ్వర ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో శోభాయాత్రను నిర్వహించారు. జడ్‌పీటీసీ సభ్యురాలు దారిశెట్టి లావణ్య - రాజేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని నిరసన

జగిత్యాల , మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు ఎన్‌హెచ్ఎం కింత పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలు సోమవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. నాలుగు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని మోతె మాలవాడ ఆరోగ్య కేంద్రం ఎదుట ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళ చేపట్టారు. అలాగే వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు మూడు నెలల వేతనాలతో పాటు ఏడు నెలల పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై తమ నిరసనను తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రెండవ ఏఎన్ఎంల రాష్ట్ర అధ్యక్షురాలు మమత ఉన్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా చంద్రయ్య ఎంపిక

వెల్గటూర్, మార్చి 18: కుమ్మరిపల్లి గౌడ సంఘం అధ్యక్షుడిగా కొప్పుల చంద్రయ్య, ఉపాధ్యక్షుడిగా కొప్పుల హన్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం కుమ్మరిపల్లిలో ఎన్నికల అధికారి మహ్మద్ అస్సాద్ ఆధ్వర్యంలో గౌడ సంఘం ఎన్నికలు నిర్వహించారు. డైరెక్టర్లుగా కొప్పుల సత్తయ్య, కొప్పుల లక్ష్మయ్య, ఫకీరు రాజయ్య, వేల్పుల అంజయ్య, వేల్పుల అక్కవ్వ, బూసరాజుల రాజయ్య, కొప్పుల లింగయ్య, రాజేశంలు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఎన్నికల అధికారి అస్సాద్ నియామక పత్రాలు అందజేశారు.

పెగడపల్లి రాజన్న ఆలయ కమిటీ ఏర్పాటు

పెగడపల్లి, మార్చి 18 : పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయకమిటీ ఛైర్మన్‌గా ఒరుగల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం నూతన కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా ఒరుగల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి రాంచంద్రం, ఉపాధ్యక్షులుగా కట్ల శ్రీనివాస్, గర్వందుల శేఖర్ గౌడ్, కోశాదికారిగా బోగ గోపికృష్ణ, సంయుక్త కార్యదర్శిగా మాదారపు కిషన్ రావు, ప్రచార కార్యదర్శులుగా మాసూరి పార్ధసారథి, జక్కుల మల్లేశంలను ఎన్నుకున్నారు. వీరితో పాటు 21 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, బొమ్మెన స్వామి పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగుల నిరసన

రాయికల్, మార్చి 18: నాగర్ కర్నూలు జిల్లా కోడేరు మండలంలో జరిగిన సంఘటనకు నిరసనగా రాయికల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఉద్యోగులు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మా, పర్యవేక్షకులు వేణుమాధవ్, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

2న ఎంపీపీ అవిశ్వాస సమావేశం

మల్యాల, మార్చి 18: మల్యాల ఎంపీపీ మిట్టపల్లి విమలపై అవిశ్వాసం ప్రకటిస్తూ ఎంపీటీసీలు ఇచ్చిన నోటీస్ నేపథ్యంలో ఎప్రిల్ 2న సమావేశం నిర్వహించడానికి జగిత్యాల ఆర్డీవో నోటీసులు జారీ చేశారు. డిశంబరు 20న ఎంపీపీపై 14 మందికి గానుపది మంది ఎంపీటీసీలు అవిశ్వాస నోటీస్‌ను ఆర్డీవోకు అందజేశారు. దీంతో జనవరి 10న అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేయగా దాన్ని వాయిదా వేయాలని హైకోర్టు నుంచి ఎంపీపీ స్టే తీసుకువచ్చారు. ఆర్డీవోలకు అవిశ్వాస సమావేశాలు నిర్వహించే అధికారం లేదని ఎంపీపీ విమలతో పాటు రాష్ట్రంలోని పలువురు ఎంపీపీలు కోర్టును ఆశ్రయించారు. దీంతో రెండు నెలలుగా వాయిదా పడుతూ వస్తున్న అవిశ్వాస ప్రక్రియకు ఇటీవల కోర్టు.. ఆర్డీవోలు సమావేశాలు నిర్వహించవచ్చుననే తీర్పు నేపథ్యంలో మల్యాల ఎంపీపీపై ఎప్రిల్ 2న అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఎంపీటీసీలకు సోమవారం ఆర్డీవో నోటీసులు అందజేశారు.

కోడ్ కూసినా.. దరఖాస్తుల స్వీకరణ!

మల్యాల, మార్చి 18: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికీ ప్రజాపాలన దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కొన్ని రోజుల క్రితం ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇటీవల జీరో బిల్లు కరంట్ బిల్లు, గ్యాస్ సిలిండర్ వివరాల నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో సోమవారం గతంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌ను ఎత్తివేసి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. దీనిపై పలువురు అభ్యంతరం తెలిపారు. ఎంపీడీవో స్వాతిని సంప్రదించగా దరఖాస్తుల స్వీకరణ నిలిపివేయాలనే ఆదేశాలు లేవని పేర్కొన్నారు.

సంకల్ప సభకు తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు

కోరుట్ల రూరల్, మార్చి 18 : జగిత్యాలలో నిర్వహించిన బీజేపీ సంకల్ప యాత్రకు జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు బయలు దేరి వెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు వారి వారి ద్విచక్ర వాహనాల ద్వార మోహన్ రావు పేటకు బీజేపీ రాష్ట్ర నాయకుడు సరభి నవీన్ రావు ఆధ్వర్యంలో చేరుకున్నారు. కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రత్యేక వాహనాల ద్వార చేరుకున్న బీజేపీ కార్యకర్తలు అభిమానుల వాహనాలను సురభి నవీన్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి నవీన్ రావు ద్విచక్ర వాహనంపై జగిత్యాలకు బయలు దేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు, చిన్నమెట్‌పల్లి ఎంపీటీసీ సభ్యుడు పంచరి విజయ్ కుమార్, యూసఫ్‌నగర్ మాజీ సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్ కౌన్సిలర్ల్ పెండం గణేష్, మ్యాడవేణి నరేష్ నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: జగిత్యాలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరించిన నేపథ్యంలో నిర్వహించిన సభకు బస్సుల్లో వందలాది మంది బీజేపీ కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు.

ధర్మపురి: జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీ విజయ సంకల్ప బహిరంగ సభ కోసం ధర్మపురి మండలంలోని పలువురు నాయకులు సోమవారం బయలుదేరారు. మోదీ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ పలు వాహనాల ద్వారా తరలి వెళ్లారు. ఇదిలా ఉండగా ప్రధాని మోదీని బీజేపీ ధర్మపురి మండల అధ్యక్షులు సంగెపు గంగారాం, పట్టణ అధ్యక్షులు బెజ్జారపు లవణ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, అసెంబ్లీ కో కన్వీనర్ బండారి లక్ష్మణ్, నలుమాసు వైకుంఠం పాల్గొన్నారు.



జగిత్యాలకు ర్యాలీగా వెలుతున్న బీజేపీ శ్రేణులు

నేటి నుంచి తక్కళ్లపల్లి వేంకటేశ్వరస్వామి జాతర

కథలాపూర్, మార్చి 18 : ఈ నెల 19 నుంచి 26 దాకా జరిగే శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 19న పుణ్యాహవచనం, అంకురారోపణ, గరుడ కళ్యాణం, ధ్వజారోహణం, 20న సుప్రభాత సేవ, చంద్రప్రభ వాహన సేవ, 21న బలి ప్రదానం, సత్యనారాయణ వ్రతం, 22న కుంకుమ పూజ, హంసవాహన సేవ, 23న కామదహనం, వాహన సేవలో స్వామివారి గ్రామ పర్యటన, 24న మహాప్రసాదం, అన్నదానం, డోలోత్సవం, బంతులాట, రథహోమం, 25న ఉదయాత్పూర్వం రథోత్సవం, స్వామివారి ఆలయ ప్రవేశం, తిరుమంజనం, 26న నాగవెళ్లి, బలి ప్రదానం, రుత్విక్ సన్మానం, ఏకాంత సేవ ఉత్సవ పరిసమాప్తి వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఛైర్మన్ జిల్లా సత్యనారాయణ తెలిపారు. భక్తులు జాతరకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వరద కాలువకు నీటి విడుదల

కథలాపూర్, మార్చి 18 : వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో వరద కాలువకు నీటి విడుదల చేశారని రైతులు, కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఎమ్మెల్యేకు రైతులు విన్నవించుకోగా నీరు విడుదల చేసి పంటలు కాపాడారని చెప్పారు. ఎమ్మెల్యేకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు శ్రేయస్సే కాంగ్రెస్ లక్ష్యం

మల్లాపూర్, మార్చి, 18 : రైతు శ్రేయస్సే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని కోరుట్ల నియోజక వర్గ పార్టీ నాయకుడు నర్సింగరావు అన్నారు. సోమవారం పలువురు పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాజీ జడ్పీటీసీ జలపతిరెడ్డితో కలిసి సమావేశంలో మాట్లాడారు. జరిగిన కార్యక్రమంలో నాయకులు కృష్ణారావు, శ్రీనివాస్‌రెడ్డి, మాసుల బుచ్చిరెడ్డిలతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించండి

కొడిమ్యాల, మార్చి 18 : బకాయి వేతనాలు చెల్లించాలని కోరతు సోమవారం ఎంపీడీవో స్వరూపకు గ్రామ పంచాయతీ సిబ్బంది వినతి పత్రాన్ని అందించారు. కారోబార్‌లను, బిల్ కలెక్టర్‌లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో జిల్లా పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్, మండల సంఘం నాయకులు దేవయ్య, రమేష్, మొహన్, లక్ష్మీరాజం ఉన్నారు.

పంట పొలాలకు నీటి విడుదల

భీమారం, మార్చి 18: మండలంలోని వరద కాలువకు నీటిని విడుదల చేయడంతో రైతులు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వరద కాలువలో నీళ్లు అడుగంటి రైతుల పంట పొలాలు ఎండిపోవడంతో మన్నెగూడెం గ్రామానికి చెందిన గంట శంకర్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి డీఈతో మాట్లాడి వరద కాలువకు నీటి విడుదల చేయించారు. దీంతో ఆది శ్రీనివాస్‌కు మండల రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠ

మెట్‌పల్లి రూరల్, మార్చి, 18 : మండలంలోని చింతలపేట గ్రామంలోని నూతనంగా నిర్మించిన శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఆలయంలో ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు వంటి తదితర పూజ కార్యక్రమాలను జరిపించారు. ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లింగారెడ్డి, మహిపాల్‌యాదవ్, గోపిడి మత్యంరెడ్డి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

మల్లాపూర్, మార్చి, 18 : మండలంలోని రాఘవుపేట గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వార్షికోత్సవం ఘనంగా ప్రారంభయ్యాయి. సోమవారం ఆలయంలో పురోహితులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు వైభవంగా జరిపారు. కోరుట్ల మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, సరోజన దంపతులు పాల్గొని పూజలు జరిపారు. ఆలయంలో నిర్వహించే వార్షికోత్సవ పనులను

రామాలయ అభివృద్ధికి కృషి

జగిత్యాల రూరల్, మార్చి 18 : రామాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాంలో కోటి రూపాయలతో నిర్మిస్తున్న రామాలయాన్ని పరిశీలించారు. రాములవారి విగ్రహాల గురించి నిర్మాణ పనులను గ్రామస్థులతో చర్చించారు.

గెస్ట్ లెక్చరర్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల రూరల్, మార్చి 18 : తెలంగాణ సాంఘీక సంక్షేమ, మహిళల గురుకుల అగ్రికల్చర్ జగిత్యాల, కోరుట్ల అల్లమయ్య గుట్ట కళాశాలల్లో ఆసక్తి గల మహిళ అతిథి అధ్యాపకులు ఎంటోమాలాజీ, ప్లాంట్ బ్రీడింగ్ బోధించేందుకు దరఖా స్తులు చేసుకోవాలని డా. శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 22 లోపు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే

మల్యాల, మార్చి 18: మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన పసుసులేటి శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం పరామర్శించారు. 5వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఎమ్మెల్యే వెంట ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శంకర్ ఉన్నారు.

కేరళ పాఠశాలలో ఓటర్ అవగాహన

కోరుట్ల, మార్చి 18 : పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాబోయే లోక్ సభ ఎన్నికలో ఓటింగ్ శాతం పెంచేందుకు గాను విద్యార్థులకు ఓటర్ అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. కరస్పాండెంట్ బారీ, ప్రిన్సిపల్ సెలీనా బారీ ఉన్నారు.

విప్, ఎమ్మెల్సీలను కలిసిన సుడా ఛైర్మన్



నరేందర్ రెడ్డిని సన్మానిస్తున్న విఫ్, ఎమ్మెల్సీ

జగిత్యాల , మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సుడా ఛైర్మన్‌గా కరీంనగర్‌కు చెందిన సీటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిసారు. అనంతరం నరేం దర్ రెడ్డి కాంగ్రెస్ శ్రేణులు షాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ అడువాల జ్యోతి, పీసీసీ సభ్యుడు గిరి నాగ భూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, నాయకలు గాజుల రాజేందర్, అడువాల లక్ష్మణ్, కొత్త మోహన్, కమటాల శ్రీనివాస్ ఉన్నారు.

వరద కాల్వకు నీటిని వదిలిన అధికారులు

మల్యాల, మార్చి 18 : మండలంలోని నూకపల్లి, మల్యాల, ముత్యంపేట, సర్వాపూర్ తదితర గ్రామాల పరిధిలోని రైతులు సాగు చేసిన వరి పంటను కాపాడుకోవటానికి అధికారులు వరద కాల్వకు నీటిని వదిలారు. కాల్వలో నీరు లేక రైతులు ఆందోళన చెందుతున్న దృష్ట్యా నూకపల్లికి చెందిన కాంగ్రెస్ నాయ కుడు శ్రీనివాస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నూకపల్లి క్రాస్ రెగ్యులేటర్ వద్ద గల నీటిని కాల్వలోకి వదిలారు.

ఎన్ఎస్ఎస్ ద్వారా మానవీయ విలువలు పెంపొందుతాయి

కొడిమ్యాల, మార్చి 18 : ఎన్ఎస్ఎస్ ద్వారా మానవీయ విలువలు, జీవన నైపుణ్యాలు పెంపొందుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ కె. మురళి అన్నారు. కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా మూడవ రోజు సోమవారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సామాజిక అభివృద్ధిలో వాలంటీర్ల పాత్ర కీలకం అన్నారు. శిబిరాల్లో పాల్గొనటం వలన శ్రమ విలువ తెలుసుకుంటు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిచుకోవచ్చునన్నారు. అంతక ముందు వలంటీర్లు మండల కేంద్రంలోని బస్టాండ్, ఆవరణ, అంబేద్కర్ విగ్రహం పెరిగిన పిచ్చి మొక్కలను తొలిగించి. చెత్త చెదారం లేకుండా ఊడ్చి శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలిగించారు. మైదానంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలిగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం మాజీ అధ్యక్షుడు వి. రాంరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఆర్. గోపికృష్ణ, కె. సతీష్, మాజీ ఉప సర్పంచు గడ్డం జీవన్‌రెడ్డి, ప్రదానోపాధ్యాయుడు ఆదిరెడ్డి, సీనియర్ వాలంటీర్లు ఎం. రవీందర్, ఆదిత్య, వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్ మురళి